క్లుప్తంగా

సమన్వయంతో పనిచేయాలి

సంతకవిటి: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల ప్రత్యేకాధికారి బి.సుధాకర రావు అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమలవుతున్న సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, మండల పరిపాలనాధికారి రఘునాదాచారి, తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామంలో వెలసిన మజ్జిగౌరీ అమ్మవారి ఆలయం ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు వావిలపల్లి నందీశ్వరరావు, జగ్గమ్మ దంపతులు, వావిలపల్లి రమణమూర్తి ఆధ్వర్యంలో శనివారం పునః మండపారాధన, కుంకుమార్చన, పుష్పార్చన, హోమం, పూర్ణాహుతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ముడుపులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో మహా అన్న సంతర్పన నిర్వహించారు.

రహదారి గోతులు పూడ్చివేత



గోతుల పూడ్చివేత పనులు పర్యవేక్షిస్తున్న పారినాయుడు

వంగర: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత కనగల పారినాయుడు తన ఔదార్యాన్ని చాటుకున్నారు. వంగర నుంచి ఎం.సీ తారాంపురం వరకు బీటీ రోడ్డు పూర్తిగా గోతులమయం కావడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇబ్బందులను గుర్తించి స్థానిక సర్పంచ్ కనగల భారతి, ఎంపీటీసీ కనగల పద్మ సహకారంతో సుమారు రెండు కిలో మీటర్ల మేర రహదారి గోతులను గ్రావెల్‌తో పూడ్చారు. దీంతో పవులురు ప్రయాణికులు ఆయన్ను అభినందించారు.

ఉపాధి పనుల పరిశీలన

రాజాం: మండలంలో బొమ్మినాయుడువలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ కె.సాయిరాం శనివారం తనిఖీ చేశారు. పనుల వద్దకు చేరుకుని వేతన దారుల మస్తర్లను వెరిఫై చేశారు. రెండు పూటలా పనిచేయాలని, కొలతల ప్రకారం పనులు చేస్తేనే గిట్టుబాటు వేతనం వస్తుందని వేతనదారులకు సూచించారు. అనంతరం పాగిరి, గురవాం, ఆగూరు తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిపనులు పరిశీలించారు.

పౌష్టికాహారం పంపిణీ



లబ్ధిదారులకు బాలామృతం పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టారు. అందులో భాగంగానే స్థానిక ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త వై.శ్రీదేవి శనివారం లబ్ధిదారులకు బాలామృతం ప్యాకెట్లు పంపిణీ చేశారు. బాలామృతం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు.

జాబ్‌మేళా రేపు

రాజాం: రాజాంలోని వైఎస్సార్ క్రాంతి పథకం (వెలుగు) మండల సమాఖ్య కార్యాలయం వద్ద ఈనెల 19న ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏసీ ఎ.చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీల్లో ప్రొడక్షన్ కెమిస్ట్, సేల్స్ మెన్స్, సూపర్ వైజర్స్, సైట్ సూపర్‌వైజర్ వంటి పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు. సీడెప్, వెలుగు శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ పూర్తిచేసిన యువత విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

పేదలకు భూ పట్టాల పంపిణీ



పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో ఎంపీపీ సన్యాసినాయుడు

మెంటాడ: మండలంలో పలువురు నిరుపేదలకు శనివారం భూమి పట్టాలు జారీ చేశారు. ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు చేతులమీదుగా డీపట్టాల నుంచి జిరాయితీ భూములుగా మారిన వాటికి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేగిడి రాంబాబు, వైస్ ఎంపీపీలు ఈశ్వరమ్మ, దుర్గ, పార్టీ నాయకులు లెంక రత్నాకర్ నాయుడు, సిరిసెట్టి నారాయణ రావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సుపరిపాలన

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



కొండపాలవలసలో సీసీరోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజా సాధికారిత సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని నాయుడువలస మధుర గ్రామం కొండపాలసవలస రామమందిరం వద్ద సుమారు రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి సమ్మిళతం చేస్తూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి అందులో పేర్కొన్న ప్రతీ హామీని అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. గ్రామీణ ప్రాంతల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగా కోట్లాది రూపాయలు ఖర్చుచేసి సీసీరోడ్లు, సీసీడ్రైయిన్లు, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు, ఇతర సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేశారని, ప్రజా ధనాన్ని దోచుకున్నారని, అన్ని వర్గాలను మోసం చేశారని దుయ్యబట్టారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వస్తుండడంతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని, వారి మాయమాటలు నమ్మొద్దని ప్రజలను కోరారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌కు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు నడిమింటి సత్యం, ఉప సర్పంచ్ లెంక శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు లెంక శ్రీనివాస రావు, తాత్రాసు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పక్కా ఏర్పాట్లు



మోదుగువలస పోలింగ్ కేంద్రంలో వసతులు పరిశీలిస్తున్న తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తి

తెర్లాం: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి అన్నారు. మండలంలోని కాగాం, మోదుగువలస, నెమలాం, చుక్కవలస, వి.చిన్నయ్యపేట, పాములవలస, సుందరాడ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ర్యాంపులు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని బీఎల్‌ఓలకు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

పైడితల్లి ఉత్సవాలకు ముహూర్తపురాట



పందిరిరాట వేస్తున్న కమిటీ సభ్యులు, గ్రామస్తులు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరకు శనివారం ముహూర్తపు రాట వేశారు. మార్చి 17 నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, ఆలయ ఈఓ బీవీ మాధవరావు తెలిపారు. మార్చి 15న నేత్రోత్సవం, 17న జాతర ప్రారంభించి 19న ఘటోత్సవంతో ముగింపు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సలాది తులసీరావు, సలాది మహేశ్వరరావు, వాకచర్ల పైడిరాజు, పెంకి చైతన్యకుమార్, ఆర్నెపల్లి వెంకటినాయుడు, గంది గోపి, పాగిరి సురేష్, అర్చకులు వేమకోటి సూర్యనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ

రామభద్రపురం: గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీ వెంకటరమణతో కలిసి శనివారం పంచాయతీల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవి సీజన్ ప్రారంభం కానున్నందున గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని వీధులూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఈ నెల 22న నిర్వహించనున్న వలంటీర్లకు అభినందన సభను విజయవంతం చేయాలన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని ముత్తాయవలసలో నాడు–నేడు కింద సుమారు రూ.12 లక్షలు, ఉపాధిహామీ నిధులు రూ.2 లక్షలు, జెడ్పీ నిధులు రూ.3 లక్షలతో ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మార్చేశారన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న విద్యాదీవెన, వంటి పథకాలతో పేద విద్యార్థుల చదువులకు భరోసా కల్పించారన్నారు. మేలు పొందిన ప్రతీ కుటుంబం జగనన్నకు తోడుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

బాడంగి: మండల కేంద్రంలోని రామభద్రాపురం–రాజాం రహదారిలో నిర్మించిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నట్లు జేసీఎస్ కన్వీనర్ మురిపి శంకరరావు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సందడిగా మజ్జిగౌరమ్మ జాతర

రాజాం: మండలంలో అంతకాపల్లి గ్రామంలో మజ్జిగౌరమ్మ 45వ జాతర వైభవంగా జరుగుతోంది. మూడురోజుల పాటు జరిగే ఈ జాతరలో భాగంగా శనివారం భక్తులు అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. అంతకాపల్లి, మొగిలివలస, వీఆర్ అగ్రహారం, సారధి, పాగిరి, రాజాం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి

వంగర: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ కమలపాటి సుధాకర్ సూచించారు. తన కార్యాలయంలో శనివారం ఎస్సై వై.వి.జనార్దన్‌తో సమీక్ష నిర్వహించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక గ్రామాల్లో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు.

40 మద్యం బాటిళ్లు పట్టివేత

రేగిడి: మండలంలో పుర్లి గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 40 మద్యం బాటిళ్లను ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి శనివారం పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వైద్య పరీక్షలు

రేగిడి: మండలంలో వావిలవలస, తాటిపాడు, లక్ష్మణవలస, లింగాలవలస తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం వైద్య తనిఖీలు నిర్వహించారు. బూరాడ పీహెచ్‌సీ వైద్యాధికారి చలంతో పాటు సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి మందులు అవసరమైన ఉచితంగా అందజేశారు.

ఆర్థిక సాయం అందజేత

రేగిడి: మండలంలో మజ్జిరాముడుపేట గ్రామానికి చెందిన పాట్నూరు దిలీప్, బలివాడ హరిబాబులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో కోలుకుంటున్న విషయం పాఠకులకు విదితమే. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు కావడంతో వారి వైద్య ఖర్చులు నిమిత్తం జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆర్థిక సాయం అందించింది. ఐసీయూలో చికిత్స పొందుతున్న దిలీప్‌కు రూ.37 వేలు, బలివాడ హరిబాబుకు రూ.3 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో ఆర్‌వీజే నాయుడు, ఎం.వెంకటేష్, శిష్టి లక్షున్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు అవార్డులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ ఎస్‌వీ మురళీకృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవామిత్ర అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన గ్రామ వలంటీర్ వ్యవస్థతో అవినీతికి తావులేకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తున్న ఈ వలంటీర్ వ్యవస్థను దేశంలోని మిగిలిన రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నాయన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని, ప్రజలకు మరింత మెరుగ్గా సేవలందించాలని వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గొలగాన రమాదేవి, చెలికాని మురళీకృష్ణ, ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఆర్.ఈశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, పలువురకు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



కారును తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ జ్ఞానప్రసాద్, పోలీసులు

రామభద్రపురం: మండలంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో వాహన తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. స్థానిక బైపాస్ జంక్షన్‌లో శనివారం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో డబ్బు, మాదకద్రవ్యాలు అక్రమ రవాణా జరగకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. సారా స్థావరాలపై ఎప్పటికప్పుడు విస్తృత దాడులు చేస్తున్నట్లు చెప్పారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన వారిపై కేసులు నమోదుచేస్తున్నట్లు చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పలుమార్లు వివిధ కేసుల్లో అరెస్టయిన వారు తమ ప్రవర్తన మార్చుకోకపోతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

రూ.36 లక్షలతో అంగన్‌వాడీల్లో వసతులు

బాడంగి: మండలంలోని 28 అంగన్‌వాడీ కేంద్రాల్లో నాడు–నేడు నిధులు సుమారు రూ.36 లక్షలతో వసతుల కల్పనకు చర్యలు చేపట్టనున్నట్లు ఎస్ఎస్ఏ ఏఈ బి.కిశోర్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించి, ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. త్వరలోనే అగ్రిమెంట్లు చేసుకుని పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఒక్కో కేంద్రానికి రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, ఫర్నీచర్, పెయింటింగ్, ఇతర మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. నాడు–నేడు ఫేజ్–2 కింద 17 పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణానికి రూ.5 కోట్ల మేర నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. వాటిలో కోడూరు హైస్కూల్‌లో–3, గొల్లాదిలో–2, పాల్తేరులో–2, రేజేరులో–2, బాడంగిలో–4, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో–4 గదులు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రూ.5 లక్షలతో ప్రాథమిక పాఠశాలతో అనుసంధానమైన 9 అంగన్‌వాడీ భవనాల మరమ్మతులు జరిగాయన్నారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కోటి రూపాయలతో మరుగుదొడ్ల సౌకర్యం, ఆర్‌ఓఆర్ ప్లాంట్, ప్రహరీ నిర్మాణం చేపట్టామన్నారు.

స్టవ్, వంటపాత్రల పంపిణీ



బాధితులకు స్టవ్ అందజేస్తున్న సిరిసహస్ర

మెంటాడ: మండల పరిధిలో రెండు వారాల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన వారికి స్టవ్, వంటపాత్రలను చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, సర్పంచ్ రేగిడి రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు రాయిపల్లి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

మెగాలోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



పోలీసులు, న్యాయవాదులతో సమావేశమైన జడ్జి కనకలక్ష్మి

గజపతినగరం: స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టులో మార్చి 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్ ను విజయవంతం చేయాలని ఆ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి కోరారు. స్థానిక కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకునేందుకు వీలున్న సివిల్,క్రిమినల్,తదితర కేసులను పరిష్కరిస్తామని చెప్పారు. కక్షిదారులకు అవగాహన కల్పించి, ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషిచేయాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో రాజీపడడానికి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ మంచి వేదిక అన్నారు. న్యాయవాదులు, పోలీసులు సహకరించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఉత్సాహంగా గుర్రాల పరుగు పందెం



పరుగు తీస్తున్న గుర్రాలు

వేపాడ: మండలంలోని జాకేరులో వీరాంజనేయ, చిన్నమ్మ, పైడమ్మ పేరంటాల తీర్థం సందర్భంగా శనివారం నిర్వహించిన గుర్రాల పరుగు పందాలు అలరించాయి. సర్పంచ్ బుద్దా చిన్నమ్మలు, అప్పల నాయుడు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. ఈ పోటీలో 13 గుర్రాలు పాల్గొనగా.. రామన్నపాలెంనకు చెందిన చోడమాంబ విక్రమ్ గుర్రం ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే కొట్యాడకు చెందిన సింగపూర్ సత్యనారాయణ ఠాగూర్ గుర్రం రెండో స్థానంలో, హనుమంతురావు గుర్రం మూడో స్థానంలో నిలిచింది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేవారు.

నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలి

- హౌసింగ్ డీఈఈ అప్పయ్య



ఇంజినీరింగ్ సహాయకులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈఈ అప్పయ్య



ముగడ జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

బాడంగి: సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు తమకు నిర్దేశించిన ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని బొబ్బిలి డివిజన్ హౌసింగ్ డీఈఈ అప్పయ్య అన్నారు. స్థానిక మండల రిపరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో హౌసింగ్ శాఖ ప్రగతిపై శనివారం సమీక్ష నిర్వహించారు. సచివాలయాల వారీగా కేటాయించిన ఇళ్లు, వాటి ప్రస్తుత స్థితిపై సిబ్బంది వద్ద వివరాలు సేకరించారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో ఎందుకు పూర్తిచేయలేకపోతున్నారని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను డీఈఈ ప్రశ్నించారు. ఇంజినీరింగ్ సహాయకులు హౌసింగ్ శాఖ పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజాప్రతినిధులకు సమాచారం కూడా ఇవ్వడం లేదని జెడ్పీటీసీ పెద్దింటి రామారావు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈవారంలో 28 ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయించాలని లక్ష్యాన్ని నిర్దేశించగా.. ఇప్పటివరకు కేవలం 5 మాత్రమే పూర్తి చేశారని, ఇలా అయితే నిర్దేశిత లక్ష్యాలను ఎప్పుడు చేరుకుంటారని ప్రత్యేకాధికారి ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణానికి రూ.20 వేలు చొప్పున అడ్వాన్స్ ఇచ్చిన ప్రాప్తికి లబ్ధిదారులతో నిర్మాణాలు పూర్తిచేయించాలని, లేదంటే ఈఏల నుంచి ఆ నిధులను రికవరీ చేయమని ఆదేశాలున్నాయన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఆంజనేయులు, హౌసింగ్ ఏఈ మురళి, తదితరులు పాల్గొన్నారు.

ముగడ కాలనీలో హౌసింగ్ డే

బాడంగి: మండలంలోని ముగడ వద్ద ఉన్న జగనన్న కాలనీని మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు శనివారం సందర్శించారు. హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో మొత్తం 51 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 20 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. రూఫ్ లెవల్‌లో 3, బీమ్ లెవల్‌లో 27 నిర్మాణాలు ఉన్నాయి. ఆయా నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని లబ్ధిదారులకు సూచించారు. బిల్లు చెల్లింపు, మెటీరియల్ సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలన్నారు. ఆయనతో పాటు ఎంపీడీఓ ఆంజనేయులు, హౌసింగ్ ఏఈ మురళీ ఉన్నారు.